# అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- హరిప్రియానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి
- వచ్చే నెల ఒకటిన ఇల్లందులో జరిగే ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం చేయాలి
- మంత్రి సత్యవతి రాథోడ్
- వేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి ఫంక్షన్ హాల్‌లో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

గార్ల, అక్టోబర్ 28 : సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటెయ్యాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. మర్రిగూడెం శ్రీ వేట వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆమె స్వామి వారి కల్యాణాన్ని వీక్షించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నవంబర్ ఒకటిన ఇల్లందులో జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు. గార్ల మండలం నుంచి 10వేల మంది కార్యకర్తలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలోనే సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ముందుంచారని అన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా బీఆర్ఎస్ పార్టీకి విశేషంగా ప్రజాదరణ లభిస్తున్నదని, హరిప్రియానాయక్ భారీ మెజార్టీతో గెలువడం ఖాయమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.200 ఉన్న పింఛన్ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రూ.2016కు పెంచి అభాగ్యులకు అండగా నిలిచినట్లు తెలిపారు. గిరిజనులకు పోడు పట్టాలు అందించి రైతుబంధు, రైతు బీమా పథకాలను వర్తింపజేశారని అన్నారు. దండగ అన్న వ్యవసాయాన్ని పండుగలా మార్చినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోతో పేద మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడే కనపడే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయ మాటలను ప్రజలు నమ్మొద్దని, ఓటుతో వారికి గుణపాఠం చెప్పాలన్నారు. 2018లో ఇల్లందు నియోజకవర్గంలో కోరం కనకయ్య ఓడిపోయినా సీఎం కేసీఆర్ గౌరవించి, భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ చైర్మన్ పదవి కట్టబెట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో ఆసరా పింఛన్ రూ.4వేలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పథకాలకు గ్యారెంటీ, వారెంటీ లేదని, ప్రజలు వారిని నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, ఇల్లందు ఏఎంసీ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్, గ్రంథాలయ చైర్మన్ దిడుగల రాజేందర్, ఎంపీపీ మూడు శివాజీచౌహాన్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, నాయకులు రంగానాథ్, బయ్యారం పీఏసీఎస్ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాధాకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

# ఢిల్లీ గులాంలకు తెలంగాణలో తావులేదు

- 3 గంటల కరెంట్ చాలన్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- సెంచరీకి పైగా స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపు
- కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం
- డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్
- ఉగ్గంపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రచారం ప్రారంభం


మరిపెడలో పద్మావతి ఇండస్ట్రీస్ అధినేత సుధాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ, అక్టోబర్ 28 : తెలంగాణ రాష్ట్రంలో ఢిల్లీ గులాంలకు స్థానం లేదని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శనివారం ఆయన మున్సిపల్ కేంద్రంలోని వివిధ వార్డుల్లో పర్యటించారు. మృతుల కుటుంబాలతోపాటు అనారోగ్యానికి గురైన వారిని పరామర్శించారు. అనంతరం పద్మావతి కాటన్ ఇండస్ట్రీస్ అధినేత ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో వాణిజ్య సంస్థలకు నాణ్యమైన కరెంటు సరఫరా చేయడంతో రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఫ్యాక్టరీలకు పవర్ హాలీడేలు ప్రకటించిన దుస్థితి ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు.సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కొట్లాటలతోనే కాలం గడిచిపోతుందన్నారు. అధికారం దాహం, తెలంగాణ వనరుల దోపిడీ లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు ప్రణాళిక రచిస్తున్నాయన్నారు. వ్యవసాయానికి 3 గంటల కరెంట్ చాలని ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి, రైతుబంధును ఆపాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు కాంగ్రెస్ వైఖరిని స్పష్టం చేస్తున్నాయన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్, రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.16వేల పెట్టుబడి, సన్నబియ్యం, రూ.400 గ్యాస్ సిలిండర్ తదితర హామీలతో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో వందకు పైగా అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ సునాయాసంగా గెలుచుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సింధూరాకుమారి, వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకన్న, ముదిరెడ్డి వీరారెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

చిన్నగూడూరు, అక్టోబర్ 28 : సీఎం కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని తన స్వగ్రామమైన ఉగ్గంపల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఉగ్గంపల్లి శివారు మంచ్యాతండా, దూమ్డాతండా, మాలోత్‌తండా, పూలసతండాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో సబ్బండ వర్గాలకు మేలు చేసేలా ఉన్నదన్నారు. అన్నపూర్ణ, కేసీఆర్ బీమా, సౌభాగ్యలక్ష్మి, సబ్సిడీ గ్యాస్, కేసీఆర్ ఆరోగ్య రక్ష వంటి పథకాలు పేదల కుటుంబాలను ఆర్థిక బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, ప్రజల అభిమానంతో భారీ మెజార్టీతో గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీసు పూలమ్మ, ఎంపీటీసీ ఉదయమ్మ, మండల అధ్యక్షుడు రాంసింగ్, ఆర్‌బీఎస్ కో ఆర్డినేటర్ మంగపతిరావు, నాయకులు మంజులాకొమురెల్లి, మల్లేశం, మురళి, యాకి, బిచ్చు, జోసెఫ్, మల్లయ్య పాల్గొన్నారు.

## నేటి నుంచి ఆత్మీయ సమావేశాలు

### గ్రామాల వారీగా సమీక్ష చేయనున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు, అక్టోబర్ 28 : ఎన్నికల నేపథ్యంలో పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు నేటి నుంచి రెండు రోజులపాటు తొర్రూరు మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో ఎల్‌వైఆర్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నారు. 29న ఆదివారం 8 గంటల నుంచి 12 గంటల వరకు సోమారం, జమస్తాన్‌పూరం, గుర్తూరు, ఖానాపురం, అమ్మాపురం, కొమ్మనపల్లి, హచ్చుతండా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎస్వీకెతండా, జీకేతండా, గుడిబండ తండా, కంఠాయపాలె, మడిపల్లి, నాంచారిమడూర్, చింతలపల్లి గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులతో సమీక్ష నిర్వహించనున్నారు. 30 సోమవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు వెలికట్ట, బోజ్యాతండా, పెద్దమంగ్యాతండా, టీక్యాతండా, కర్కాల, హరిపిరాల, దుబ్బతండా, అమర్‌సింగ్ తండా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు వెంకటాపురం, చీకటాయపాలెం, చెర్లపాలెం, గోపాలగిరి, ఫత్తేపురం, పోలెపల్లి, మాటేడు గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులతో సమీక్ష నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సీతారాములు, ప్రమోద్ తెలిపారు.


డీజీపీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబాబాద్ నుంచి పాల్గొన్న ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య

## ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

### డీజీపీ అంజనీకుమార్

మహబూబాబాద్, అక్టోబర్ 28 : తెలంగాణ రాష్ట్రంలో జరిగే శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ, లాంగ్ పెండింగ్ కేసులపై శనివారం ఆయన హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం నుంచి అన్ని జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ రాష్ట్రంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలని ఉండాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సైబర్ నేరాలు జరుగకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని వివరించారు. ఈ సమీక్షలో మహబూబాబాద్ నుంచి అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్, తొర్రూరు డీఎస్పీలు తీర్థాల సత్యనారాయణ, వెంకటేశ్వరబాబు, సీసీఎస్ డీఎస్పీ గండ్రాతి మోహన్, ఎస్బీ సీఐ బాలాజీవరప్రసాద్, డీసీఆర్బీ సీఐ ఇస్లావత్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



మరిపెడ: టీఎస్ గురుకులంలో మాట్లాడుతున్న తొర్రూరు జడ్జి సరిత

## విద్యార్థులు పట్టుదలతో చదవాలి

### తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి సరిత

మరిపెడ/చిన్నగూడూరు, అక్టోబర్ 28 : ప్రతి విద్యార్థి తన ఉజ్వల భవిష్యత్ కోసం పట్టుదలతో చదవాలని తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి సరిత అన్నారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని టీఎస్ గురుకులం పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో కడుపు నింపుకునేందుకు విద్యార్థులు చదువుమాని కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, శుచి శుభ్రతతో కూడిన ఆహారం విద్యార్థులకు అందుతుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రంగాల్లో రాణించాలన్నారు. మరిపెడలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఎస్సై పవన్, చిన్నగూడూరులో ఎస్సై సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## నాగజ్యోతి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి

ములుగురూరల్, అక్టోబర్ 28: ములు గు నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వలసల పరంపర కొనసాగుతున్నది. 'బైబై సీతక్క... వెల్‌కమ్ జ్యోతక్క' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని రాష్ట్ర రెడ్కో చైర్మన్, ములుగు మండల ఎన్నికల ఇన్‌చార్జి ఏరువ సతీశ్‌రెడ్డి అన్నారు. శనివారం ములుగులో కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ అనుముల సురేశ్ శిరీషతో పాటు పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి సతీశ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి బిడ్డ అయిన బడే నాగజ్యోతి ప్రజాసేవను వారసత్వంగా అందుకొని పోరాట యోధుడి కుమార్తెగా ఎన్నికల బరిలో నిలిచిందని, ఆమె గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన వారితో సతీశ్‌రెడ్డి, నాయకులు